క్లుప్తంగా

పల్లె ఖర్జూరం ఈత పండ్లు



పిఠాపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఈత పండ్లతో కళకళలాడుతున్న ఈత చెట్టు



ఈత పండ్లు

పిఠాపురం: ఎటువంటి రసాయనిక మందులు, ఎరువులు వేయకుండా సహజ సిద్ధంగా పండే పండ్లు తింటే ఆరోగ్యం సిద్ధిస్తుందని వైద్యులు చెబుతారు. వాటిలో గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా కనిపించే ఈతపండ్లది అగ్రస్థానంగా చెప్పొచ్చు. గ్రామాల్లోని పొలం గట్లపై ఎక్కడ చూసినా ఈత చెట్లు కనిపిస్తుంటాయి. వేసవిలో అందుబాటులోకి వచ్చే ప్రకృతి వరప్రదాయిని ఈతపండ్లను పల్లె ఖర్జూరాలు, ఎల్లో చెర్రీస్‌గానూ పిలుస్తుంటారు. ఈత పండ్లలో అనేక పోషకాలు ఉండడంతో ఆరోగ్యానికి ఎంతో మేలు చేకూరుస్తాయని, అన్ని వయసులవారు తినదగ్గవని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం పల్లె, పట్టణమన్న తేడా లేకుండా ఈత పళ్ల అమ్మకాలు ఊపందుకున్నాయి.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద నిరంతర నిఘా

ఆర్వో వెంకటరావు



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టవంతమైన నిఘా ఏర్పాటు చేశామని కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే. వెంకటరావు తెలిపారు. శనివారం ఆయన జేఎన్టీయూకే ఆవరణలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీసులతో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. మరోవైపు సీసీ కెమెరా నిఘా కూడా కొనసాగుతుందన్నారు. ఎప్పటికప్పుడు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని ఆర్వో చెప్పారు. అనంతరం కౌంటింగ్ కేంద్రాన్ని కూడా సందర్శించారు. జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్‌కు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అక్కడి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట పలువురు ఎన్నికల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేడు గాంధీభవన్‌లో కవి స్వరం సభ

బోట్‌క్లబ్: స్థానిక గాంధీభవన్‌లో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, కథకుడు జి. వెంకటకృష్ణ సాహిత్య పరిచయం, కవిస్వరం సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు మార్ని జానకిరామ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటకృష్ణ సాహిత్య నేపథ్యాన్ని అద్దేపల్లి ప్రభ పరిచయం చేస్తారన్నారు. అనంతరం జరిగే కవిసమ్మేళనం కార్యక్రమంలో కవులందరూ స్వీయ కవితా పఠనం చేయాలని కోరారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కాకినాడ సిటీ: నగరపాలక సంస్థలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహన డ్రైవర్లకు రెండు నెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, డ్రైవర్స్ యూనియన్ కోశాధికారి ఇస్మాయిల్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నెల జీతం ఇప్పటికీ జమ కాలేదన్నారు. కమిషనర్ వెంకటరావు జీతాలు చెల్లించాలని ఆదేశించారన్నారని, వాటిని విడుదల చేయాలని కోరారు. యూనియన్ నాయకులు సంతోష్, విక్టర్, భద్ర, రాజేష్ పాల్గొన్నారు.

8 నుంచి ఎస్‌ఎఫ్‌ఐ విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులు

కాకినాడ సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు శ్రీకాకుళం జిల్లాలో 8 నుంచి 15వ తేదీ వరకు జరుగుతాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకులు పి.వరహాలు, ఎం.గంగా సూరిబాబులు తెలిపారు. శనివారం కాకినాడలోని సుందరయ్యభవన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాలో జరుగుతున్న విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని, ఎస్ఎఫ్ఐ, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జి.శ్రీకాంత్, ఎ.వాసుదేశ్, సాహిత్, గోపాలకృష్ణ, సిద్ధు, లోవరాజు, వెంకటేశ్, అరుణ్‌కుమార్, చిన్ని పాల్గొన్నారు.



పెద్దాపురంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ కమిటీ సభ్యులు



ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న మట్టే శ్రీనివాస్



ఆంజనేయుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



తమలపాకులు, మల్లెదండల నడుమ స్వామివారు

వైభవంగా హనుమజ్జయంతి

- ఘనంగా పంచామృతాభిషేకాలు
- ఆకు పూజలు, చాలీసా పారాయణ
- భక్తులతో ఆలయాలు కిటకిట



మట్టే వారి కల్యాణ మండపంలో స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

పెద్దాపురం: హనుమజ్జయంతి వేడుకలను నియోజకవర్గ ప్రజలు ఘనంగా నిర్వహించారు. పెద్దాపురం పట్టణంలో మిరపకాలయ వీధి ఆంజనేయ స్వామి ఆలయం వద్ద, రాజుగారి వీధిలోని మట్టే వారి కళ్యాణ మండపం వద్ద నుంచి హనుమజ్జయంతి కమిటీ, అఖండ హిందూ సభ్యులు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, హనుమానా చాలీసా పారాయణంతో పాటు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఉత్తర కాశీ స్వామిజీ భాస్కరేంద్ర సరస్వతిచే ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పులిమేరులో చదలాడ జంక్షన్ వద్ద హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఆలయ నిర్మాత తుమ్మల అచ్యుతరామయ్య ఆధ్వర్యంలో భజన సంకీర్తనలు, స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే జి.రాగంపేటలో సనాతన ధర్మ గీత ప్రచారకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో గీతా జ్ఞాన యజ్ఞం నిర్వహించారు. స్వామి వారికి తమలపాకుల పూజ, చాలీసా పారాయణ ఘనంగా నిర్వహించారు. ఆశ్రమాధిపతి మాతా సేవానందగిరి, మేడిశెట్టి అంజిబాబు, సత్యకుమార్, సతీష్, అంబిక, శ్రీదేవి తదితర భక్తులు పాల్గొన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట: పట్టణ, మండల పరిధిలో భక్తులు ఘనంగా హనుమజ్జయంతిని నిర్వహించారు. ఈ మేరకు ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు, రామాలయాలలో ఆంజనేయునికి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. స్థానిక ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకోవడానికి ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయ ధర్మకర్త చంద్రాభట్ల పంతంజలి శాస్త్రి ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమాలల్లో పారిశ్రామిక వేత్త మట్టే శ్రీనివాసు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు.. ఆలయంలో హోమాలు నిర్వహిం చారు. స్థానిక స్టేషన్‌సెంటర్ లోని భక్తాంజంనేయస్వామి ఆలయంలోను, కోట్లమ్మ చెరువువద్ద ఉన్న వీరాంజనేయస్వామి ఆలయంలోను, రాజీవ్ గృహకల్ప వద్ద ఆంజనేయస్వామి ఆలయం లోను భక్తులు పూజలు చేశారు. కోట్లమ్మ చెరువు వద్ద ఆలయ కమిటీ నాయకులు క్షత్రి రాజారాం సింగ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో న్యాయవాది వనమోజు రాఘవేంద్ర దంపతులు, పారిశ్రామిక వేత్త నేరెళ్ల గంగాధర్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదే విధంగా ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఖండవిల్లి సూర్యనారాయణ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా సాగిన శోభాయాత్ర ఆర్య వైశ్య సేవా భవనంలో ముగిసింది. అక్కడ హనుమాన్ చాలీసా, పూజా కార్యక్రమాలు, భక్తి ప్రవచనాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

గొల్లప్రోలులో..

గొల్లప్రోలు: పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ఆంజనేయస్వామి ఆలయాల వద్ద హనుమత్ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. చేబ్రోలు రామాలయం లోని ఆంజనేయస్వామికి విఘ్నేశ్వర పూజ, లక్ష్మీగణపతి హోమం, తమలపాకులు, సింధూరంతో పూజ నిర్వహించారు. సాయంత్రం సహస్ర గళ హనుమాన్ చాలీసా పారాయణ, భజనా కార్యక్రమాలు జరిపారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తెలుగు భాషపై పట్టు అవసరం



పీసీసీ క్యాంప్‌లో కరాటేపై మెళకువలు నేర్పుతున్న సుధాకర్



గ్రంథాలయంలో నీతి కథలు నేర్చుకుంటున్న విద్యార్థులు

పెద్దాపురం: తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థులు పిన్న వయసు నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని జి.రాజేష్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం తెలుగు పద్యాలు, నీతి కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పీసీసీలో..

ప్రతి విద్యార్థి కరాటేలో తమ నైపుణ్యాన్ని మరింత మెరుగుపర్చుకోవాలని విశాఖ కరాటే అసోషియేషన్ ఉపాధ్యక్షుడు మల్లా సుధాకర్ అన్నారు. పట్టణంలోని వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో నిర్వహిస్తున్న పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) సమ్మర్ క్యాంప్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్యాంప్ కన్వీనర్ కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ కరాటేను క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. విద్యార్థుల ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం కరాటే మెళకువలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్, కరాటే టీచర్ దుంగల పూజిత, సూర్యశ్రీ, రవికుమార్, అమృత, నమ్రత తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



చేబ్రోలులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గొల్లప్రోలు: కిశోర బాలికలు సమతుల ఆహారాన్ని తీసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.కృష్ణవేణి తెలిపారు. మండలంలోని చేబ్రోలులో రుతుస్రావం పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు ఆకుకూరలు, గుడ్లు, పాలు వంటి సమతుల ఆహారాన్ని తీసుకుంటే రుతుక్రమం సక్రమంగా ఉంటుందన్నారు. రక్తహీనత ఉన్నవారికి రుతుక్రమం ఆగుతుందని, దీని నివారణకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ఎంపీఎచ్ఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సీజనలో వచ్చే మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఎస్ రమణమూర్తి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌంటింగ్ సమర్థంగా నిర్వహించాలి



కౌంటింగ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జేఎస్ రామారావు



శిక్షణకు హాజరైన సిబ్బంది

- ఆర్డీఓ జేఎస్ రామారావు
- సిబ్బందికి శిక్షణ తరగతులు

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నెల నాలుగో తేదీన కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించే కౌంటింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. స్థానిక మహారాణి కళాశాలలో శనివారం సాయంత్రం కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన్న సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ జేఎస్ రామారావు మాట్లాడుతూ జేఎన్‌టీయూ ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడెంచల భద్రత కల్పించామన్నారు. నాలుగో తేదీ ఉదయం పెద్దాపురం మండలం జె.తిమ్మాపురం ఒకటో నెంబర్ పోలింగ్ బూత్ నుంచి కౌంటింగ్ ప్రారంభమై సామర్లకోట మండలం పనసపాడు 201వ పోలింగ్ కేంద్రంతో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందన్నారు. కౌటింగ్ ప్రక్రియకు సంబంధించి 14 టేబుళ్ల ద్వారా 15 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం సిబ్బంది సమన్వయం పాటించి కౌటింగ్ ప్రక్రియకు సహకరించాలని ఆర్డీఓ జేఎస్ రామారావు కోరారు. ఉదయం ఆరు గంటలకు విధులు నిర్వహించే సిబ్బంది కౌటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలన్నారు. సిబ్బంది ప్రతి ఒక్కరూ తమ గుర్తింపు కార్డు, ఆర్డర్ కాపీని వెంట తీసుకురావాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు కౌటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందిని ఆర్డీఓ జేఎస్ రామారావు ఆదేశించారు. అనంతరం పలు అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు కేవీ పద్మావతి, రామారావు, ఆర్డీఓ కార్యాలయ డీటీ భానుకుమార్, కౌంటింగ్ ప్రక్రియ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలో 84 శాతం పింఛన్ల పంపిణీ

ఎంపీడీఓ ఉషారాణి



జి.రాగంపేటలో పింఛన్ అందజేస్తున్న ఎంపీడీఓ ఉషారాణి

పెద్దాపురం: మండలంలోని ఆయా గ్రామాల్లో తొలిరోజు 84 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు పెద్దాపురం ఎంపీడీఓ జి.ఉషారాణి తెలిపారు. శనివారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల ఐదో తేదీ వరకు పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు. సొమ్ములు అందని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. లబ్ధిదారులకు తమ ఖాతాల్లోనే పింఛన్ సొమ్ములు జమ చేసినట్టు తెలిపారు. లేవలేని స్థితిలో ఉన్నవారు, సాంకేతిక లోపం వల్ల సొమ్ములు ఖాతాలో పడని వారికి సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా పింఛన్లు అందజేస్తామన్నారు. తొలిరోజు ఒక్కరోజుకే మండలంలో 84 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఉషారాణి తెలిపారు. ఆమె వెంట మండల విస్తరణాధికారి కె.రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి రమేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విద్యా ప్రమాణాలను వివరించాలి

- ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి
- విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించేలా ప్రోత్సహించాలి
- ఎస్‌జీటీలతో డీఈఓ రమేష్ సమీక్ష

కరప: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు, అమలుచేస్తున్న పథకాలను వివరిస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించేలా చైతన్య పరచాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం కరప, పెదపూడి మండలాల ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్స్) ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు తాము పనిచేస్తున్న గ్రామాల్లోని తల్లిదండ్రులను కలసి ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించిన వసతులు, క్వాలిఫైడ్ టీచర్లతో విద్యాబోధన, మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా అందిస్తున్న పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, షూస్ వంటి వసతులు అందిస్తున్న విషయాలను వివరించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల పోటీని ఎదుర్కొనేందుకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చర్చించుకుని, పిల్లలను ఆకర్షించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపిస్తే క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తామని తల్లిదండ్రులకు భరోసా కల్పించాలన్నారు. అందుకు ప్రతి ఉపాధ్యాయుడుకు సొంతంగా ఎకడమిక్ ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించకపోవడం లోని లోపాలను గుర్తించి, వాటిని సరిచేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అన్ని చర్యలు తీసుకోవాలని డీఈఓ రమేష్ సూచించారు. ఉపాధ్యాయులు పనితనాన్ని మెరుగుపరచుకుని, ప్రజల్లో గుర్తింపు పొందాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాలల వారీగా ఎంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారో సమీక్షించి, విద్యార్థుల సంఖ్య పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను వివరించి, ఉపాధ్యాయులకు డీఈఓ రమేష్ అవగాహన కల్పించారు. డీవైఈఓ కె.వెంకటేశ్వరరావు, కరప, పెదపూడి మండలాల విద్యాశాఖాధికారులు కె.బుల్లి కృష్ణవేణి, పి.సత్యనారాయణ, సీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

భూమికి సారం.. వారికి జీవనాధారం



రైతు పొలంలో కాపు వేసిన మేకలు, గొర్రెల మంద

- సంప్రదాయ పద్ధతుల్లో భూసారం పెంచేందుకు అన్నదాతల ఆసక్తి
- పొలాల్లో గొర్రెలు, మేకల మందలతో కాపు

గొల్లప్రోలు: మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల వినియోగంతో భూసారం తగ్గిపోతుంది. ఇలాంటి చర్యలు భవిష్యత్ తరాలకు ప్రతికూలకంగా మారతాయని వ్యవసాయ అధికారులు శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. దీంతో రైతుల ఆలోచన విధానంలో మార్పు వస్తోంది. దీంతో పాత సంప్రదాయ పద్ధతుల్లోనే భూసారం పెంచేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. దీంట్లో ప్రధానమైనవి గొర్రెలు, మేకల (జీవాల) మందలను కాపుకాయటం, చెరువు పూడిక మట్టిని పొలాల్లో వేయడం, కుళ్లిన గత్తం వేసుకోవటం, పచ్చిరొట్టసాగు వంటి పద్ధతులను పాటించడం చేస్తున్నారు.

జీవాలతో వలస..

పొలంలో జీవాల మందల కాపు కాయటంతో భూమికి సారంతో పాటు పెంపకందారులకు ఆదాయ మార్గంగా ఉంటుంది. గొల్లప్రోలు, పిఠాపురం, ప్రత్తిపాడు, శంఖవరం, తుని, రౌతులపూడి తదితర మండలాల్లో జీవాల మంద కాపు కాసేవారు ఎక్కువగా ఉన్నారు. వీరు జిల్లా నలుమూలలకు జీవాల మందలను తీసుకుని వలసలు వెళ్తుంటారు. పగలంతా మేతకు వెళ్లి గొర్రెలు, మేకల మందను రైతు పొలానికి తీసుకొచ్చి రాత్రంతా అక్కడే ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో ఉంచడంతో అవి వేసే పేడ(గెత్తం) వల్ల భూసారం పెరుగుతుంది. ఒక రాత్రి రైతు పొలంలో మంద ఉంచేందుకు భోజనం, ఖర్చులకు గాను రూ.600 నుంచి రూ.800 వరకూ ఇస్తారు. ఎకరా పొలంలో నాలుగైదు రాత్రులు మంద కాపు కాయటం వల్ల భూమి సారవంతంగా మారుతుంది. పంట సమయంలో ఎరువులు, పురుగు మందుల ఖర్చు సగానికి తగ్గిపోతుంది. పురుగుల మందు, ఎరువుల అవశేషాల్లేని పంట దిగుబడులను సాధించొచ్చు.

వేసవిలో అనుకూలం

గొర్రెలు, మేకల(జీవాల) మందలను కాపు కాసేందుకు వేసవి అనుకూలం. ఖరీఫ్ తరువాత రబీలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు వేసుకుంటారు. పంటకోత తరువాత మందలు కాపు కాస్తారు. వేసవి వర్షాలు పడినప్పుడు పొలం దుక్కి చేస్తారు. ఆ సమయంలో గొర్రెలు, మేకల వ్యర్థాలు భూమిలో కలిసి భూసారాన్ని పెంచుతాయి. ఈ వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుంది.

పురుగుమందుల వినియోగం తగ్గుతుంది



మేకలు, గొర్రెల మంద కాయడం మా పూర్వీకుల నుంచి వస్తుంది. రోజూ మరో ఇద్దరితో కలిసి జీవాలను మేతకు తీసుకెళతాను. వేసవిలో రైతుల పొలాల్లో కాపు కాయటం వల్ల భోజనం, ఖర్చులకు డబ్బులు ఇస్తారు. పొలాల్లో మంద కాపు కాయటం వల్ల భూమికి మేలు జరుగుతుంది. దీనివల్ల ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గుతుంది.

– ఇనరపు ఏసుబాబు, గొర్రెల మంద యజమాని, చేబ్రోలు, గొల్లప్రోలు మండలం

భూసారం పెరుగుతుంది



పొలంలో గొర్రెలు, మేకల మందలను కాపు కాయటం వల్ల భూసారం పెరుగుతుంది. పంట దిగుబడుల్లో ఎరువులు, పురుగు మందుల ప్రభావం లేకుండా ఉంటుంది. ఎరువుల వాడకంతో మిత్ర పురుగులు నశిస్తాయి. ఏటా మందలు కాపు కాయటం వల్ల భూమి సారవంతమవుతుంది. భూమి పొరల్లో ఉండే మిత్ర పురుగుల సంఖ్య పెరుగుతుంది.

– కె.సత్యనారాయణ, ఏఓ, గొల్లప్రోలు